ముఖ్యమంత్రి కార్యాలయము

తెలంగాణ ప్రభుత్వము

పత్రికా ప్రకటన-3 తేదిః 15.9.2014.

హైదరాబాద్‌లో అన్ని హంగులతో సాంస్కృతిక కళా ప్రదర్శనలు ఇవ్వడానికి, కళాకారులకు శిక్షణ ఇవ్వడానికి అనువుగా ఒ కళాభవనాన్ని నిర్మించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు నిర్ణయించారు. రవీంద్రభారతిలో సోమవారం ముఖ్యమంత్రి సాంస్కృతిక శాఖ, పర్యాటక శాఖ కార్యకలాపాలపై సమీక్ష నిర్వహించారు. తెలంగాణలో సాంస్కృతిక పునరుజ్జీవనానికి కృషి చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు. కళాకారులకు శిక్షణ ఇవ్వడం, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులకు వసతి, ఎక్కువ మంది ప్రేక్షకులు పట్టే విధంగా ఓ కొత్త కళాభవనాన్ని నిర్మించాలని కూడా ముఖ్యమంత్రి అధికారులకు చెప్పారు. ఇందుకు అనువైన స్థలం కోసం సమీక్ష జరిపారు. రవీంద్రభారతి వెనుకవైపు వున్న దాదాపు 1600 గజాల స్థలాన్ని ముఖ్యమంత్రి పరిశీలించారు. ఈ స్థలాన్ని రవీంద్రభారతి విస్తరణ కోసం వాడుకోవాలని చెప్పారు. నగరంలో సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో వున్న భవనాలు, స్థలాలు, వాటిలో నిర్వహించే కార్యక్రమాలు, ఆదాయ వ్యయాలు తదితర అంశాలపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. సాంస్కృతిక, కళా ప్రదర్శనల కోసం ఇప్పటి వరకు జరిగిన కార్యక్రమాలను కూడా సమీక్షించారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు, విడుదలవుతున్న నిధుల గురించి కూడా ఆరా తీశారు. తెలంగాణ రాష్ట్రంలో సాంస్కృతిక కళా రంగాలను ఒ పద్ధతి ప్రకారం అభివృద్ధి చేయాలని, తెలంగాణ కళలను ప్రోత్సహించే విధంగా ప్రభుత్వ విధానం వుంటుందని చెప్పారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం చేసే పనులకు విస్తృత ప్రచారం కల్పించడం కోసం

కళాకారులను వినియోగించుకోవాలని, వీటివల్ల కళాకారులకు ఉపాధి దొరుకుతుందని, కార్యక్రమాలకు మంచి ప్రచారం జరిగి పారదర్శకత పెరుగుతుందని ముఖ్యమంత్రి అన్నారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో వున్న భవనాలు, స్థలాలపై కూడా ముఖ్యమంత్రి ఆరా తీశారు. ఈ రెండు శాఖల ఆధ్వర్యంలో జిల్లాల్లో జరుగుతున్న కార్యక్రమాలను కూడా ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు.

సమావేశంలో ప్రభుత్వ సలహాదారు కెవి.రమణాచారి, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ రాళ్లబండి కవితాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

---

సిపిఆర్ఓ టు సిఎం